కథ ఎట్లా ఉండాలె

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు

'రాజేశ్వరీ! మీకథలు యేమి బాగున్నాయండీ అని అంటూనే ఉన్నావు వాటిమీద దినదినమూ ప్రశంసాపూర్వకవిమర్శలు పత్రికలో వెలువడుతూనే ఉన్నవి.' అంటూ లోపలికి వచ్చాడు రాఘవరావు టౌనుహాలునుండి వస్తూనే.

రాజేశ్వరి అందుకు బదులేమీ చెప్పకుండా నవ్వి ఊరుకుంది.

'మధురభారతి' పత్రిక యిప్పుడే టౌనుహాల్లో చూచివచ్చాను. దానిలో నాకథాసంపుటిపై యెటువంటి విమర్శకవ్యాసం పడ్డదనుకున్నావు! నాకెఱుక లేని శిల్పమూ సౌందర్యమూ మధురిమా నాకథల్లో ఉన్నదని సోదాహరణంగా యెత్తిచూపాడా విమర్శకుడు' అన్నాడు రాఘవరావు మురుస్తూ.

'ఆవిమర్శకు డెవరు? మీ స్నేహితుడేగాదూ?' అన్నది రాజేశ్వరి కొంచెం పరిహాసంగా నవ్వుతూ.

'ఎబ్బే స్నేహితుడుగాడు.'

'పోని మీమిత్రమండలి సభ్యుడా?'

'ఏమో తెలియదు.'

'పేరు వ్రాయలేదా?'

'పూర్తిపేరు వ్రాయలేదు. సో. సూ. పొడిఅక్షరాలున్నవి.'

'మీ స్నేహితుడు కాకుండా ఉండడు బాగా జ్ఞాపకం చేసుకోండి.'

'సరి సరి. యింకా అంత మతిమఱపురాలేదు, బహుశా అతడు నాస్నేహితుడుగాడు.'

'అదిగో బహుశా అంటున్నారే, ఏదో దూరపు స్నేహితుడై ఉన్నట్టున్నాడు.'

రాఘవరావు పక్కుననవ్వి 'బంధువుల్లో దూరపువాళ్లనీ, దగ్గరవాళ్లనీ ఉండటం యెఱుగుదుం. స్నేహితుల్లో ఈమాట నీవల్లనే వింటున్నాను.'

'ఒకవేళ మీక్లాసుమేటేమో. ఆలోచించారూ?'

'ఎందుకింత తీవ్రశోధన? ఎవరైతేనేమి?'

'మీమీద ప్రశంసాత్మకవ్యాసం వ్రాశేవాళ్లు మీ స్నేహితులై ఉండవలెగదా నని.'

'విమర్శకు మిత్రులే కావలెనా? వస్తువు నాణెమైందయితే యెవరైనా బాగున్నదంటారు.'

'కానప్పుడు?'

'ఓ యిదా నీ అనుమానం? మా స్నేహితుల్లో రంధ్రాన్వేషణ పండితులేయెక్కువ. బాగా లేని దాన్ని బాగాఉన్నదని వాళ్లు యెన్నటికీ అనరు.'

'అది యితరుల నెఱసుల నెన్నడంలోనేమోగాని మీలో మీకుగాదు.'

'మాలో మేము విమర్శించుకోమా?'

'మీమిత్రమండలివారు మంచి కలిసికట్టుతనం గలవాళ్లు. ఒకరికొకరు ఆదుకుంటూ ఉండటం మీ సభ్యరీతి.'

'అంటే___'

'మీమండలివారిలోనే ఒకరు గ్రంథం వ్రాయడం, యింకొకరు పీఠిక వ్రాయడం, మరొకరు దానిని పత్రికాముఖాన ప్రశంసించడం, దాని నెవరైనా కాదని పొరబాటుగా అంటే వేరొకరు వారిని గట్టిగా మందలించడం. ఆవిధంగా జయించుకొస్తున్నారు. మీరు యెంతెంతవారినీ మొత్తంమీద మీ కలిసికట్టుతనానికి ముచ్చటవుతున్నది.'

'అయితే మారచనలు బాగా ఉండకపోయినా మా ప్రచారంవల్లనే వ్యాప్తికి తెస్తున్నామని నీఅభిప్రాయమా?'

'మీకు బాగానే ఉన్నట్టువిలెండి. మీలో మీకే బాగుండకపోతే యింత అట్టహాసం యెందుకుచేస్తారు?

ఇతరులబాగోగుల పరిశీలనతో మీకు నిమిత్తంలేదు. మీమిత్రమండలి ప్రచురించే పుస్తకాలు, పీఠికలు, అభిప్రాయాలు విమర్శనలు అన్నీ చూస్తూఉంటాము గదా. ఆపరిచితమైన పేర్లుదప్ప క్రొత్తవి కన్పడవు. ఇవ్వాళ మీమధురకథాసంపుటిపై వారుప్రశంసావాక్యాలు కురిపిస్తే రేపు వారికన్నిటికి కరటాలపై మీరూ, మొత్తంమీద ఒకరిరచనలకొకరు వందిమాగధులు కావడం మీ పద్ధతి.'

'మా నవీనరచయితల నీవింతనవ్వులాలు పట్టిస్తున్నావుగాని మేము కలంపట్టినతర్వాతనే వ్యవహారభాషకూ గేయకవితకూ, భావగీతాలకు, కథారచనకు చక్కనిబాట యేర్పడ్డది. నేడు కథకూ, గీతానికీ, చోటివ్వని దినపత్రికగాని, వారపత్రికగాని, పక్షపత్రికగాని, మాసపత్రికగాని, వార్షికపత్రికగాని, ఒక్కటైనా ఉన్నదేమో చూపగలవా? ఇది మానవ్యసాహితీపరుల పరిశ్రమాఫలితమని చెప్పుకొని గర్వింపవలసినవిషయమే నంటావా? కాదంటావా?'

'ఈమాత్రానికి గర్వించవలసినవిషయం యేమీ లేదు. కథావాఙ్మయంగాని గేయవాఙ్మయంగాని ఆంధ్రభాషావధూటికి సరిక్రొత్త సొమ్ములుగావు. భట్టివిక్రమార్కుడికథలు, కాశీమజిలీకథలు, పంచతంత్రం కథలు, పన్నిద్దరురాజుల కథలు, అంటూ యెన్నెన్నోకథలు అనాదినుంచీ మనదేశంలో వాగ్రూపకంగానూ గ్రంథస్థంగానూగూడా వాడుకలో వున్నవి. ఇక మాజోలపాటలు, దంపుళ్లపాటలు మున్నగుపాటల్లో ఉన్నమాధుర్యం ఏభావకవితకూ తీసిపోదుగదా. మానవులకు కథాప్రియత్వం సహజసిద్ధం. మనచిన్నవాడు చూడండి కథంటే యెంత చెవి కోసుకుంటాడో. కథచెప్తానంటేసరి అదేమిచిత్రమో ఎంతయేడ్పూ మానుతాడు. అభము శుభమెఱుగని పసిబిడ్డగదా వాడికెందుకు కథంటే అంత ప్రేమ! పిల్లలేగాదు పెద్దవాళ్లకూ కథంటే ప్రాణమే. మొన్న మాసమాజభవనంలో బాలికాసమ్మేళనంజరిపి పిల్లలకు చెప్తూవుంటే పెద్దవాళ్లుగూడా చెవులు దోరగిలబెట్టి విన్నారు ఎంతో శ్రద్ధతో. అందుకనే కథాప్రియత్వం మానవులకు సహజసిద్ధమని అంటున్నాను. కనుక తెలుగువారికి ప్రీతి మేము కలుగచేశామని మీరు జబ్బ చఱుచుకుంటే మేము ఒప్పుకోము. అసలు బిడ్డలకు వలెనే కథలకుకూడా మాతృత్వం మాది,' అన్నది రాజేశ్వరి సగర్వంగా.

ఆమాటలువిని రాఘవరావు పకాపకనవ్వి 'ఇప్పటికి గుట్టుబయటబడ్డది. ఎన్ని మెలికలు త్రిప్పైనా యేయొక్క గౌరవమూ మీసంఘానికి చెందించాలని చూస్తావు. పాపం! నీజాత్యభిమానం అసమానం' అన్నాడు.

'అయితే నేనుచెప్పింది అబద్ధమంటారా? నిజం ఆలోచించండి. మీశైశవంలో మీకు కథా ప్రీతి కల్గించినది మీతల్లిగారు. నాకు కల్గించింది మాఅమ్మ. నేనూ మీరూ యేమిటి లోకంలో ప్రతితల్లీ ప్రతి బిడ్డకూ కథాబోధవల్లనే ప్రపంచజ్ఞానం కలుగజేస్తున్నది. కనుక మీరేమన్నా నవ్వండి, సౌధానికి పునాది మాది. వృక్షానికి బీజావాపం మాది.'

'సరేసరే కానీ, నీవు యేదో తిప్పలుపడి మీ స్త్రీసంఘానికి ఆధిక్యత కలిగించాలెనని ప్రాకులాడుతుంటే నేనెందుకు కాదనాలె. నీవేగాదులే. ఇప్పుడు మతాలవారేమి; కులాలవారేమి; వృత్తులవారేమి; అందఱూ యిదేపద్ధతి. ఏపాతపురాణాలో పెళ్లగించి ఏయొక్క గౌరవమూ తమసంఘానికి చెందించవలెనని పాటుపడుతున్నారు. అట్లాగే నీవూ.'

'సత్యమైనా అంగీకరించకుండా మనుష్యులను డీలాచేయడంలో మీకున్నంతనేర్పు యెవ్వరికీలేదు.'

'నాకథలు బాగున్నవని లోకమంతా పొగుడుతూ ఉంటే నీవు బాగున్నాయని ఒప్పుకుంటున్నావా?'

'ఓహో అందుకు బదులాయిది? మీకథలు బాగున్నాయని అంగీకరించడానికి నాకేమీ అభ్యంతరంలేదు. మీరూ యేదో చాకచక్యంగా నే

వ్రాస్తారు. కాని ఉత్తమశ్రేణికి చెందించడానికితగిన లక్షణాలు మీకథలకింకా తక్కువే అని నా అభిప్రాయం. ఉండవలసినలక్షణాలన్నీ లేనప్పుడు సర్వాంగసుందరంగా ఉందని ప్రశంసించడం నాచేత గాదుసుమండీ. అయినా మీకథలను నాచేత బాగా విమర్శింపజేసి లోపాలు తెలుసుకుంటే మీకు లాభంగాని బలవంతపెట్టి బాగున్నా యనిపించుకుంటే ఏమి ప్రయోజనము చెప్పండి?' అన్నది రాజేశ్వరి.

యింతలో వంటమనిషి సుబ్బమ్మ వంటయింట్లో నుంచివచ్చి మెల్లగా 'అమ్మగారూ!' అన్నది. 'అవునండోయి మఱచిపోయినా. మనం త్వరగా భోజనాలుకానివ్వాలె. యివ్వాళ సుబ్బమ్మ కనకతార చూడటానికి పోతానని పెందలాడేవచ్చి వంటచేసి మీకోసం కనిపెట్టుకొని కూర్చున్నది. మనం త్వరగా భోజనాలుచేస్తేనేగాని ఆమెపనిఅయి రెండోఆటకు అందుకోలేదు' అన్నది రాజేశ్వరి. 'ఏముందా కనకతారలో దబ్బిచ్చి యేడ్చుకొని తెచ్చుకోడమేగా. సరే సిద్ధం వడ్డించమను వస్తున్నా' అన్నాడు రాఘవరావు.

రాజేశ్వరి దొడ్లోకిపోయి పెనిమిటికి కాళ్లు కడుక్కునే నీళ్లుతెస్తూ 'సుబ్బమ్మా! నాకుగూడావడ్డించు నీకు పని త్వరగా తెములుతుంది' అన్నది. సుబ్బమ్మ యిద్దఱికీ వడ్డించడానికి వెండి పళ్లాలుపెట్టింది. రాఘవరావు కాళ్లుకడుక్కొని ఉతికిఆరవేసిన చెంగాయిపంచె కట్టుకొని తువ్వాలు బుజానవేసుకొని భోజనాలయింట్లోకి వచ్చాడు. అతనివెంటనే రాజేశ్వరిగూడా వచ్చింది. 'పిల్లలు అన్నాలు తిన్నారా యేమి'టన్నాడు రాఘవరావు.

'అవును. వాళ్లకు వంటకాగానే పెట్టేశాను తిని నిద్రపోయినారన్నది' రాజేశ్వరి.

౨

భోజనాలు తొందరగా కావాలెనని అనుకుంటూ ఉండటంచేత భోజనాలవద్ద మాటలు పెట్టుకోకుండా త్వరగా తినిలేచారు రాఘవరావు రాజేశ్వరీ. రాజేశ్వరి భోజనానంతరం కూరలు వగైరాలు సర్దుకుంటూ వుంటే రాఘవరావు వరండాలో పచారుచేస్తున్నాడు. సర్దుబాటుపూర్తై రాజేశ్వరి తములపాకుల పొందాను తీసుకొని సావిట్లోకి వచ్చేటప్పటికి రాఘవరావుగూడా పచారుముగింపుచేసి సావిట్లో పడుకకుర్చీలో వచ్చి విశ్రమించాడు. ఇంతలో సుబ్బమ్మ ఆదరాబాదరా తానుగూడా అన్నంతిని వెండికంచాకడిగి తెచ్చి రాజేశ్వరికీయెదురుగా గోడకానించిపెట్టి పాలకుండతెచ్చి నడవాలోపెట్టి యిల్లుకడిగి తలుపులు వేసివచ్చి, 'అమ్మగారూ నేను వెళ్లుతున్నాను. పాలు వేడిగావుంటే నడవాలోపెట్టాను కొంచెంతాళి తోడు వేసుకోండి' అన్నది. 'సరే, వెళ్లు. ఇదిగో పావలా తీసుకపోయి టిక్కట్టు కొనుక్కో. వేళైంది త్వరగా వెళ్లు' అని రాజేశ్వరి సుబ్బమ్మను పంపించింది.

సుబ్బమ్మ వెళ్లగానే రాఘవరావు రాజేశ్వరివంక చూచి 'రాజేశ్వరీ! యిందాక నాకథల్లో లోపాలేమిటో వెల్లడిస్తానంటివే, ఏదీ కొంచెం వెల్లడించూ' అన్నాడు.

'ఏదో తమాషాకంటె ఆమాటే పట్టుకున్నారేమిటిని?'

'తమాషా యేమిటి నేను వొప్పుకోను. విమర్శింపజేసి లోపాలు తెలుసుకోడం ప్రయోజనమని నీవు చెప్పుతున్నప్పుడు ఆప్రయోజనం అర్ధాంగలక్ష్మివైన నీవే కలుగజేస్తానంటున్నప్పుడు ఆ అవకాశం నేనెందుకు పోగొట్టుకోవాలెని?'

'నేను మీ కథలమాటే చెప్పలేదు సుమండీ. మొత్తం యిప్పటి కథలమాటన్నాను.'

'ఓ మఱీమంచిది. నామీద ఆరోపణలేకుండా వినడమంటే మరీమంచిదేగా. కానీ, త్వరగా నాకు మళ్లీ నిద్రవస్తుంది.'

'నిద్రవస్తే పోండి. ఈచర్చల కేమి యివ్వాళ కాకపోతే రేపు.'

'అట్లాగాదు. శుభస్య శీఘ్రమన్నాడు. ఈ సంగతి యిప్పుడే తేల్చుకోవాలె. లేకపోతే నిద్ర వచ్చినా తేలిపోతుంది. హాయిగాపట్టదు.'

'ఏదైనా ఒకకథ వ్రాశామూఅంటే అది సర్వవిధాకర్షణకలదిగా ఉండాలె.'

'అనగా కొంచెం వివరంగా సెలవివ్వాలె.'

'అబ్బా! మీతో మాటమాట్లాడితే యిదేతంటా. మాటమాటకు వెక్కిరిస్తుంటారు.'

'కోపపడకు. ఆటలోదెబ్బ అరటిపండు.'

'మనోహరమైన ఒక గులాబిపువ్వుయొక్క ఆకృతి, రంగు, మృదుత్వము, పరిమళము, మకరందము మనల నెట్లా ఆకర్షిస్తూ ఉంటాయో అల్లాగే కథాకుసుమంగూడా కల్పన అనే ఆకృతీ, వర్ణన అనే రంగూ, శైలి అనే మృదుత్వము, రసము నే పరిమళము, నీతి అనే మకరందము గలిగి ఆకర్షవంతమైనదిగా ఉండాలె. ఇందులో యేదిలోపించినా కథాకుసుమం రాణించదు. ఇప్పుడు వ్రాయబడే కథల్లో ఒకటుంటే ఒకటుండదు. చూస్తున్నారో లేదో!'

'నీవు పొరబాటుపడుతున్నావు. ఇప్పుడు వ్రాయబడే కథలన్నీ నీవు చెప్పిన లక్షణాలన్నీ కలిగే ఉంటున్నవి. విను. కల్పనలో మా నవీనులు అసదృశులుగదా.'

'అసభ్యకల్పనలో ఘట్టు.'

'ప్రకృతే మా విహారమందిరం గనుక, మేము ప్రకృతి ఉపాసకులమే గనుక సహజవర్ణనావైదగ్ధ్యంలో మా కెవరూ సాటిరారు.'

'సహజమని ఉచితానుచితా లెఱుగకుండా అన్నీ వర్ణిస్తే అసభ్యమనిపించుకుంటుంది. యిప్పటి కథలు వెగటు పుట్టించడానికి ముఖ్యకారణము యిటువంటి వర్ణనలుండటమే. వర్ణన సహజమైనా ఉచితాన్ని మీరగూడదు.'

'మార్దవం మన తెలుగుభాషలోనే సహజంగా చెఱుకుముక్కలో తీపిలాగావున్నది గనుక దానికి ప్రత్యేకంగా ప్రాకులాడవలసిన పనేలేదు.'

'సహజంగా ఉంటేనేమి ఉపయోగించేవారి నేర్పునుబట్టే మృదువు మృదువుగా కనపడుతుంది. మృదువైన మన తెలుగులోనే కఠోరశబ్దజాలంతో గూడిన గ్రంథా లెన్నిలేవు. వసుచరిత్ర పాండిత్య విశేషంచేత గొప్ప గ్రంథమైనప్పటికీ మృదుత్వం లేకపోబట్టే గదా మనుచరిత్రంత లాలిత్యంగలది కాదనుపించుకొంటున్నది.'

'రసమంటావా? ప్రతికథలోనూ యెక్కి తొక్కి ఇది రసయుగం ఇప్పటి కవులందఱు రసజగద్విహారులు. కనుక రసవిషయమై నీవు చెప్పిన ఆక్షేపణ చెల్లనే చెల్లదు.'

'రస మెప్పుడూ పూవిలో తావివలె వాక్యంలో మిళితమైయుండాలె. అందులో హాస్యరసం విషయంలో యిది యెంత గర్భితంగాఉంటె అంత మనోహరంగా ఉంటుంది. నవ్వించడానికే అని వ్రాసే ఆకటావికటపు వ్రాతలు చక్కిలిగిలిపెట్టి నవ్వించినట్లు మొరటుగాఉంటాయి. హాస్యానికి ప్రత్యేక రూపు యివ్వడం పామరజనరంజకమేగా పండితహృదయాహ్లాదకరం గాదు. ఏరసమైనా ప్రయత్నపూర్వకంగా పైకిచిందిస్తే అసహ్యంవేస్తుంది. ఒక కథలోనే గాదు. ఉపన్యాసంలోనైనా హాస్యం అధికంగా కనిపిస్తే వికృతంగా ఉంటుంది. కూరలో ఉప్పువేయకపోవడం యెంత అరుచికరమో, అధికంగావేయడమూ అంత అరుచికరమే. కనుక కథకూ ఉపన్యాసానికీ అన్నిటికీ రసమువసరమే. కాని దేనికీ మితత్వమే సొగసు కూరుస్తుంది. ఆమధ్య టౌనుహాల్లో యెవరో పండిత కవిగారు ఉపన్యాసమిస్తారని పిలుచుకుపోయినారు జ్ఞాపకమున్నదా? మాట మాటకు నవ్వించాడాయన. వుపన్యాసం విన్నంత సేపూ ఆయికిలించడం బాగానేఉన్నది. తీరా యింటికి వచ్చేటప్పటికి యింత ఉపన్యాసంలోనూ నిలవ జేసుకోడానికి యేమి కన్పడలేదేమా అని ప్రాణం ఉసూరు మనిపించింది.'

'అదే నీ తెలివితక్కువ. నిలవేమి చేసుకోవాలె. ఆయన గొప్ప విద్వత్కవి. మంచి చమత్కారి. కమ్మనిపద్యాలు చదివాడు. వినోదకరమైన విషయాలు చెప్పాడు. అందఱు ఉల్లాసంగా విన్నారు. ఆనందించారు. యింకా యింటికేమి తెచ్చుకోవాలె.'

కథ ఎట్లాఉండాలె

'కాదండి. ఒక మహాపండితుడు చేసిన ఉపన్యాసం విని నవ్వేశేదిగానేనా ఉండవలసింది? జ్ఞానమధువును కొంచెమో గొప్పో సేకరించుకోవలసిందిగా ఉండవద్దా? గులాబిపువ్వు సౌందర్యము, సౌరభమూ, సౌకుమార్యము ఒక్కనాటితో నశించిపోతుంది. దానినుండి మధుపముగూర్చిన తేనె యెంతకాలముంటుందో యెన్నిటికి వినియోగిస్తుందో చూచారా? అట్లాగే ప్రతిరచనలోనూ ప్రతిప్రసంగంలోను నైతికమైన లేక వైజ్ఞానికమైన ఒక సత్యవస్తువుకూడా ఉండాలె. అట్లాఉంటేనే రచయితయొక్క శ్రమ సార్థకమౌతుంది. ఆవిధంగా కాకుండా యిప్పటి మీ నవీనరచయితల్లాగా తాత్కాలికోల్లాసమే కథయొక్క ఉద్దేశ్యమైతే అందు ప్రణయవ్యవహారాలే కథకు ముఖ్యవస్తువైతే అంతకంటె మంచివి మీరు వ్రాయలేకపోతే అవేతప్ప పాఠకులకు రుచించకపోతే కథలు, కథకులు, కథాపాఠకులుగూడా భ్రష్టమార్గంపట్టినారనే చెప్పవచ్చును' అంటూ రాజేశ్వరి ఏదో జ్ఞాపకం వచ్చినట్లై చివాలునలేచి లోపలికి వెళ్లింది.

రాఘవరావు తింటూతింటూ ఉండగా అయిపోయిన రుచిరపదార్థంకోసం యెదురు చూస్తూవున్నవాడిలాగా కుతూహలంతో రాజేశ్వరి రాకకెదురుచూస్తూవున్నాడు.

రాజేశ్వరి పాలల్లో తోడువేసి ఉట్టిమీదపెట్టి మూతపెట్టి 'మాట్లాడుతూ కూర్చుంటే పాలు చప్పగా చల్లారిపోయినాయి సుమా' అంటూ సావిట్లోకి వచ్చింది.

'అవును. ఏపనైనా పదునుమీద ఉండగానే చెయ్యాలె. ఇప్పటి నీ విమర్శకవాదంగూడా అంతే చప్పగా చల్లారితే నిస్సారమే అయిపోతుంది. వేడిమీద ఉండగానే కానివ్వమన్నాడు' రాఘవరావు.

"కథలలో ఉత్తమ మధ్యమాధమాలున్నాయి. శైలీ మాధుర్యము, వర్ణనాచాతుర్యము, కల్పనాసౌందర్యము, రసౌచిత్యము, నైతికాదర్శముగలవే ఉత్తమశ్రేణికి చెందిన కథలు. ఇటువంటి కథలు వాఙ్మయంలో స్థిరమైన స్థానం సంపాదించుకుంటూటాయి. ప్రజాదరం పొందుతాయి. వీటికి పాతగిలిపోవడమంటూ ఉండదు. రవీంద్రుని కథలు యిటువంటి శ్రేణికి చెందినవే. అతడు యేనీతినీ, యే ధర్మాన్నీ వెల్లడిగా యేకరువుపెట్టడు. అయినా ప్రతికథా ఏదో ఒక ఉత్తమాదర్శాన్ని వ్యక్తీకరిస్తూనే ఉంటుంది. ఒకకథలో ఒక అధర్మాన్ని అతడు నిరూపించాడూ అంటే ఆ అధర్మము తనజీవితంలో యెప్పుడూ చేయడానికి సాహసింపజాలనంత గాఢంగా పాఠకుడి హృదయంలో నాటుతాడు అతడు. అన్నిగుణాలుగలిగి నైతికాదర్శం లుప్తమైనవే మధ్యమతరగతి కథలు. ఈ నడిమిరకం కథలుగూడా జవము జీవముగల భాషలోనే వ్రాయబడుతవి. వర్ణనగూడా సహజంగానే ఉంటుంది. పాత్రపోషణాది కల్పనావిధానంగూడా బాగానే ఉంటుంది. రసపోషణకూ లోపం ఉండదు. కాని నైతికమైన ఒక ఉత్తమాదర్శం లేనందువల్ల ప్రజాహృదయంలో స్థిరమైన ఉనికి సంపాదించుకోలేవు. పాఠకులకు తాత్కాలికానందం కలిగించడంలో ఈ కథలపని పూర్తిఅవుతుంది. ఒకమాటు చదవడంతోనే పాఠకులు తృప్తిపొందుతారు. ఏనేర్పూ లేక యేదో చిత్తంవచ్చినట్లు వెకిలిగా యే యువతీదర్శన, వల్ల కల్గిన భావోద్రేకంవల్లనో వ్రాయబడేవే అధమతరగతి కథలు. ఇప్పుడు తెలుగుపత్రికల్లో ప్రకటింపబడే కథలు చాలావఱకు ఈ కడపటితరగతికి చెందినవిగానే ఉంటున్నాయి. ఇటువంటి కథలు వ్యాప్తి పొందడంవల్ల ప్రజలకుగాని భాషకుగాని యేలాటి ప్రయోజనమూలేదు. ఇటువంటి కథల యొక్క బ్రతుకు ఆ వొక్కసంచికతో ముగిసిపోతుంది. విద్యార్థులశ్రేయం కోరే ఉపాధ్యాయుడు ఇటువంటి కథలు తన విద్యార్థి చదువడానికి అంగీకరింపడు. బిడ్డలక్షేమం గోరే తలిదండ్రులు యివి తమపిల్లలు చదువడానికి ఒప్పుకోరు. ఇక నైతికశిక్షణ మత్త్వవపరమగు బాలవితంతువులు మున్నగువారు వీనిని చదవ

డం వారి అయోగ్యతకు చిహ్నంగా ఊహింపబడటం చేత వానిని స్పృశించడానికే భయపడిపోతారు. ఇంతయెందుకు. సామాన్యంగా పెద్దమనుష్యు లనబడే వా రెవరుగాని యిట్టి కథలుగల పుస్తకాన్ని చేత పట్టుకొని బయటికిరావడానికి సంకోచిస్తారంటే నమ్మండి.

రానురాను ప్రజలకత్యంతప్రీతిపాత్రమైన కథా వాఙ్మయమిట్టి హీనమార్గంపట్టి భయోత్పాతం కలిగించేదిగా అయిపోవడం శ్రేయస్కరమనే అంటారా? నామటుకు నాకు అన్ని తరగతులవారు ధారాళంగా చదివిన ప్రతివారూ నైతికంగా యేకొంచెమో ప్రయోజనం పొందడానికి అర్హమైనవే మంచికథలని తాత్పర్యం అన్నది రాజేశ్వరి.

రాఘవరావు రాజేశ్వరి చెప్పిన మాటలన్నీ శాంతంగావిని 'రాజేశ్వరీ నీవు కథలనుగూర్చి చేసిన పరిశీలనకు చాలా సంతోషం కాని నీతి లౌభ్యంలోపడి కథ యెటువంటివస్తువో తెలుసుకోలేక పోయినందుకు విచారమవుతున్నది. కథ 'వినరా వేమ, గదరా సుమతీ' వంటి నీతి శతకంగాదు. నీతి నిబద్ధమైనకథలూ వుండవచ్చును. కాని ప్రతికథనూ నీతిచట్రంలోనే బిగించవలెననడం తెలివి తక్కువైనపని స్వేచ్ఛగా, ఉల్లాసంగా, బుద్ధివైశద్యం కొద్దీ, వికసింపవలసిన కథాకుసుమం యిందువల్ల సంకుచితమై సౌందర్య భ్రష్టమైపోతుంది. అసలు కథారచన ఒకకళా విశేషం. దాని ప్రయోజనం ఆనందం. దానిని నైతిక శిక్షణాది ప్రయోజనాలకు వినియోగించుకోవాలెనని యత్నించడం అరసికులపని' అన్నాడు రాఘవరావు.

"మీ యువకవుల అభిప్రాయాలన్నీ అచ్చునదీసినట్లు ఒకటిగానే ఉంటాయి కాబోలు! ఆమధ్య నెవరోగూడా పత్రికలో యిట్లాగే వ్రాయంగా చూచాను. కళంటే నాకూ యిష్టమే. వట్టి బంగారపు ముద్దకంటె ఆబంగారంతో చేయబడిన ఆభరణం యెక్కువ అందమైనదిగా విలువకలదిగా ఉంటుందని నాకు తెలియకపోలేదు. అసలు కళంటే యథేచ్ఛగా వ్రాయడంకాదు. నేను చెప్పిన లక్షణాలన్నీ కలిగి ఉండడమే. కథ వట్టిపొడిమాటలుగా కాక మంచి బుద్ధి వైశద్యంతో మనోహరవర్ణనాచాతుర్యంతో పాత్రపోషణాసంవిధానంతో తయారుకావడం బాగానే ఉంటుంది. కాని కళనేపేరుతో సంభాషణగాగాని వర్ణనగాగాని అవినీతిని చొప్పించడం యుక్తంగాదు. బంగారాన్ని యెంతనగిషీ వస్తువుగానైనా తయారుచేయవచ్చునుగాని అందులో రాగిగాని యిత్తడిగాని కలిపి దాని విశుద్ధత చెఱపడం యుక్తం కాదు గదా' అన్నది రాజేశ్వరి.

'సరి సరి. ఇంతనీతి మడిగట్టుకొని కథలు వ్రాస్తే వాటి అందం చెప్పనక్కర్లేదు. చదవకుండానే ప్రజలు సంతోషిస్తారు.'

'మరేమీ భయంలేదు. ఆవిధంగా నీతిబద్ధమైన కథలు వ్రాసినప్పుడే కథలవిలువ యెక్కువౌతుంది. ప్రజల ఆదరం విస్తరిస్తుంది. తెలుగువారేగాక యితరులు గూడా వానిని తమతమ భాషలోకి తర్జుమా చేసుకొని మరీ చదువుతారు. టాలుస్టాయి కథలు ప్రేమచందు కథలు చూడండి మన తెలుగులోకి ఎట్లా అనువాదింపబడుతున్నాయో. వానికా గౌరవం ఎందువల్ల వచ్చింది? మీరేమైనా చెప్పండి అది కథగానీ కావ్యంగానీ గేయంగానీ గీతంగానీ చిత్రంగానీ శిల్పగానీ మానవకల్యాణమునకు ఉపయోగించగల యుత్కృష్టత దానియందంతర్గర్భితమైయుంటేనే దానికి—'

ఇంతలో ఉయ్యాలత్రాళ్లు చల్లంగా కదలడం మొదలుపెట్టినాయి. నూరుమాటలాడుతున్నా దానియందు దృష్టియేమరకుండావున్న రాజేశ్వరి ఆసవ్వడి కనిపెట్టడంతోటే 'పిల్ల లేచినట్లుంది'అని చివాలునలేచి పిల్లకు పాలుపట్టేపనిలో నిమగ్నురాలైంది.

రాఘవరావుగూడా గడియారంవంక, తలత్రిప్పి చూచి 'అబ్బో పదిన్నరైందే' అంటూ వెన్నువిరుస్తూ లేచి వెళ్లి గదిలో మంచంమీద మేను వాల్చాడు.